క్లుప్తంగా

పాలకవర్గానికి సన్మానం



సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంథని: మంథని ఎంపీపీ కొండ శంకర్‌తో పాటు పాలకవర్గ సభ్యులను బుధవారం అధికారులు, పలు పార్టీల నాయకులు సన్మానించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మండల పరిషత్ పాలకవర్గం ఐదేళ్లు పూర్తయినందున సందర్భంగా ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులను సన్మానించారు.

ఆత్మీయ సత్కారం



సత్కరిస్తున్న అధికారులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మిరవి, వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్, ఎంపీటీసీలు శెవ్వ శంకరయ్యను బుధవారం ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేసి సన్మానించారు. వారి పదవీకాలం బుధవారంతో ముగియంతో సన్మానించారు. మండల ప్రత్యేక అధికారి రహుఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఎంపీడీవో శేషయ్య సూరి, సీనియర్ అసిస్టెంట్ వంశీ, ఏపీవో లావణ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

జూలపల్లి: మండల కేంద్రం నుంచి అబ్బాపూర్ వెళ్లే దారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను అధికారులు మంగళవారం తొలగించారు. ప్రధాన దారిలో ఉన్న ముళ్లపొదలతో వాహనాదారులు పడుతున్న ఇబ్బందులను ఎంపీటీసీ దండె వెంకటేశం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామపంచాయతీ, ఏపీవో సదానందం ఉపాధిహామీలో కూలీలతో ఉమ్మడిగా తొలగింపు చేపట్టారు.

మురుగునీరు లేకుండా చూసుకోవాలి



ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్: మురుగునీరు నిల్వ లేకుండా కాలనీవాసులు ఇంటి చుట్టుపక్కలా చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. 2, 6, 9, 12, 14వ వార్డుల్లో బుధవారం మురికి నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చుట్టుపక్కలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైస్‌చైర్మన్ బిరుదు సమత, మేనేజర్ అలీమొద్దీన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని నియంత్రిద్దాం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారిని నియంత్రించేందుకు ఆరోగ్య జీవనశైలిని అలవర్చుకోవాలని రెడ్‌రిబ్బన్ క్లబ్ జిల్లా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నప్రసన్న సూచించారు. పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్‌లీడర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ నర్సింహారావుతో పాటు సురేందర్‌రెడ్డి, అశోక్‌కుమార్, గందె రమేశ్, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మణిగనేశన్, రాజేందర్ ఉన్నారు.

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని సుద్దాల, కనుకుల, గర్రెపెల్లి పీఏసీఎస్ కార్యాలయంలో వ్యవసాయాధికారులు రైతుభరోసా కార్యక్రమంలో భాగంగా రైతుల నుంచి బుధవారం అభిప్రాయాలు సేకరించారు. మెజార్టీ రైతులు 10 ఎకరాలలోపు రైతు భరోసా ఇవ్వాలని అభిప్రాయాలు తెలిపారు. జిల్లా సహకార సంఘాల అధికారి రామానుజాచారి, జిల్లా వ్యసాయ అసిస్టెంట్ అధికారి శ్రీనాథ్, జిల్లా సహకార అధికారులు సురేందర్‌రెడ్డి, ప్రశాంత్, స్రవంతి, సీఈవోలు శంకరయ్యగౌడ్, సతీశ్, రవి, సంఘం డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

గోదావరిఖని: బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ 5న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆర్జీ–2 ఏరియాలోని పలు డిపార్ట్‌మెంట్లపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వార మాట్లాడారు. నాయకులు ఎల్.ప్రకాశ్, రాజారత్నం, జీగురు రవీందర్, బుర్ర తిరుపతి, అన్నారావు, శాంసన్, సాంబశివరావు పాల్గొన్నారు.

సేవచేస్తేనే ప్రజలు ఆదరిస్తారు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీసే రోజులు పోయాయని, అధికారం ఉందని అహంకారం ప్రదర్శిస్తే ప్రజలు తమ విలువైన ఓటు ద్వారా తీర్పు చెప్తున్నారని, సేవచేస్తేనే ప్రజలు ఓటేసి ఎన్నుకుంటారని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఎంపీటీసీలు జట్టి దేవేందర్, గడ్డం రాంచంద్రం, సుముకం నిర్మల, కొల్లూరి రమాదేవి, రావి సదానందం, గూడెపు జనార్దన్ రెడ్డి, బొల్లమల్ల కౌసల్య, మాదాసు సువర్ణ, పెండ్లి సంపత్, కదురు మానసల, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీంలను ఎమ్మెల్యే సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవీకాలం ముగిసినా ప్రజల వెన్నంటే ఉండాలన్నారు. ఐదేళ్ల పాలనలో సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, మీడియాకు సన్మాన గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

అడవులతోనే మానవ మనుగడ

అడవులతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈజీఎస్ నేతృత్వంలో మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. తహసీల్దార్ జాహెద్ పాషా, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఏపీవో మంజుల, డీటీ ధీరజ్ పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రభుత్వం కట్టడి చేయకపోతే ప్రయివేటు పాఠశాలల తీరుతో ప్రభుత్వ స్కూళ్లు మూతపడే ప్రమాదం ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరిందని, సబ్‌సెంటర్లకు నూతన భవనాలు నిర్మించాలని విన్నవించారు. భూ సమస్యలు, కరెంట్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు సకాలంలో పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్, పక్కన అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ చేతన

పెద్దపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ చేతన, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్‌లతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న పథకాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. స్వయం ఉపాధి యూనిట్లు పెండింగ్‌లో ఉంటే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకాలను అందించాలని, ప్రభుత్వ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని పేర్కొన్నారు. ఆర్డీవోలు గంగయ్య, హనుమానాయక్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

పెద్దపల్లికి వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను ఉద్యోగ జేఏసీ నాయకులు బొంకూరి శంకర్, రవీందర్ తదితరులు కలెక్టరేట్‌లో సన్మానించారు. ఎస్సీ సంఘాల నాయకులు ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో సత్కరించారు.

ఉద్యమాలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: బొగ్గుబ్లాకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమానికి యూనియన్ శ్రేణులు సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా నామినేషన్ కింద సింగరేణికి ఇవ్వాలన్నారు. దీనికోసం ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు సింగరేణివ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపు మేరకు జూలై 5న కలెక్టర్ కార్యాలయాలను ముట్టడి, జూలై 8 నుంచి 12 వరకు సింగరేణివ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు, 10న జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద ధర్నా, 17న హైదరాబాద్‌లో వేలం వేసే ఆఫీసు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సింగరేణి మనుగడ కొనసాగాలంటే పెద్ద ఎత్తున జరిగే ఆందోళన కార్యక్రమాల్లో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు మాదన మహేశ్, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, రంగు శ్రీనివాస్, బ్రాంచి ఆఫీసు బేరర్లు, ఆయా గనుల పిట్ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్లకు ఆఫీస్ ఆర్డర్ ఇప్పించండి

గోదావరిఖని: అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న టెక్నీషియన్లకు సర్వీస్‌లో పెండింగ్‌లో ఉన్న ఆఫీస్ ఆర్డర్లు ఇప్పించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యను కోరారు. భాస్కర్‌రావు భవన్‌కు వచ్చిన ఆయనకు టెక్నీషియన్లు బుధవారం రాత్రి వినతిపత్రం అందజేశారు. టెక్నీషియన్లు పి.నాగేందర్‌కుమార్, తిరుపతి, విద్యాసాగర్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

బ్యాంకుల వద్ద పోలీసుల ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

గోదావరిఖని: గోదావరిఖనిలోని బ్యాంకుల్లో పోలీసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అమాయక బాధితుల నుంచి డబ్బు దొంగతనాలు, ఏటీఎంల వద్ద మోసం చేసి డబ్బులు దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను తనిఖీ చేశారు. బ్యాంక్‌ల వద్ద భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో పనిచేసే అలారం సిస్టం పనితీరును పరిశీలించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న కందుల సంధ్యారాణి

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. బీజేపీ నాయకులు కొమ్ము గట్టయ్య, మూకిరి రాజు, ఆకుల కుమార్, సాగర్, మల్లేశ్, కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు సాధ్యం అవుతాయని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని గుంపుల, శానగొండ, బీమారిపల్లె గ్రామాల్లో బుధవారం సీసీరోడ్లు, మత్తడి, ఫంక్షన్‌హాలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కొమిరలో పెద్దపల్లి తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిప్పారపు శారదసంపత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు రాజన్నను ఆదర్శంగా తీసుకోవాలి

సుల్తానాబాద్: రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజన్నను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పట్టణంలోని ట్యాంక్ రోడ్డు సమీపంలో నివాసం ఉండే రిటైర్డ్ ఉద్యోగి దాసరి రాజన్న(78) అనారోగ్యంతో బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతదేహానికి నివాళి అర్పించారు. అంత్యక్రియల్లో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు జాలి మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల రాజమల్లు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రకటించిన సంక్షేమ పథకాలను సత్వరమే అమలు చేయాలని బుధవారం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోమారపు లావణ్య రామగుండం తహసీల్దార్ గెరివెణ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. లావణ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలైనా మహిళలకు మహాలక్ష్మి పథకం కింద చెల్లిస్తామన్న రూ.2,500 సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బాలికల హాస్టల్ ప్రారంభించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రానికి మంజూరైన ఎస్సీ బాలికల హాస్టల్‌ను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ బాలికల హాస్టల్ లేక పలు ప్రాంతాల నుంచి వచ్చే బాలికలు ఉన్నత చదువుల కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. బకాయి ఉపకారవేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డి మాండ్ చేశారు. నాయకులు సందీప్, ప్రశాంత్, సిద్ధార్థ, రోషన్, శివ, రాజ్‌కుమార్, రాహుల్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు, జాగ్రత్తలపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీ పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపులు, పాటించాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఎస్సై ఓంకార్ యాదవ్, ఏఎస్సై నీలిమ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి చట్టరీత్యా శిక్ష తప్పదన్నారు. ఈవ్‌టీజింగ్‌కు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అపరిచితులతో వాట్సాప్ చాటింగ్ వద్దు

పెద్దపల్లిరూరల్: విద్యార్థినులు అపరిచితులతో ఆన్‌లైన్ చాటింగ్ చేయొద్దని, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో, సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేయొద్దని సీఐ కృష్ణ సూచించారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. షీటీం కానిస్టేబుల్ స్నేహలత, సురేశ్ ఉన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే జీవితశిక్ష

ఓదెల: మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే జీవితశిక్ష తప్పదని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఓదెలలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై వేధింపులకు పాల్పడితే కనీసం పదేళ్లు, గరిష్ఠంగా జీవితకాల శిక్ష, ఉరిశిక్ష పడుతుందన్నారు.

బొగ్గుగనుల వేలం రద్దు చేయాలి

రామగిరి: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు కోరారు. బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్‌సీరెడ్డి ఆధ్వర్యంలో ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ 5న సింగరేణి వ్యాపించి ఉన్న అన్ని కలెక్టరేట్‌లను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ముట్టడించనున్నట్లు తెలిపారు. సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచంద్రం, పిట్ సెక్రటరీ వెంకటస్వామి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సంతోష్, సు రేశ్, వర్క్‌షాప్ పిట్ సెక్రటరీ పోశం పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

గోదావరిఖనిటౌన్: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సహకరించాలని విద్యార్థి సంఘాలు కోరాయి. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల్ల దుర్గాప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్, సోను, సునీల్, రాహుల్, భరత్, శ్రావణ్, కృష్ణకుమార్, సురేశ్, శివకుమార్, సూర్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

గోదావరిఖని: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై కార్మిక కుటుంబాలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్జీ–2 ఆరోగ్య అధికారి కె.పద్మ సూచించారు. ఓసీపీ–3లో బుధవారం కార్మికులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను గురించి వివరించారు. మేనేజర్ భరత్‌కుమార్, సేఫ్టీ ఆఫీసర్ పాపయ్య, అధికారి సురేందర్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలంపై కాంగ్రెస్ వైఖరి ప్రకటించాలి

సుల్తానాబాద్: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ప్రకటించాలని ఏఐటీయూసీ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ కడారి సునీల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహిళల భద్రత కోసం షీ టీం

సుల్తానాబాద్: మహిళల భద్రత కోసమే షీ టీం పనిచేస్తుందని షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం షీ టీంపై అవగాహన సమావేశ నిర్వహించారు. ఎవరైనా వేధింపులకు గురైతే 6303 923700 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఎస్సై శ్రవణ్‌కుమార్, నరేశ్, ప్రిన్సిపాల్ మెరాజ్, షీ టీం, ఉమెన్ పీసీ స్నేహలత, కానిస్టేబుల్ సురేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగుండం: అంతర్గాం మండల పరిధి బద్రిపల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన పచ్చునూరి రమేశ్ ఇటీవల క్యాన్సర్‌తో మరణించాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు. భార్య కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. బుధవారం రమేశ్ దశదినకర్మ నిమిత్తం శ్రీసీతారామసేవా సమితి మృతుడి కుటుంబసభ్యులను కలిసి రూ.5,500 నగదు, 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసరాలు అందజేసింది. సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ, మండల రమాదేవి, సరిత లక్ష్మి ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైంది

సుల్తానాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకమైందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు హౌస్ ఎలక్షన్స్ నిర్వహించారు. 892 మంది విద్యార్థులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఉన్నత లక్ష్యం సాధనే ధ్యేయంగా చదవాలి

జూలపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యం సాధనే లక్ష్యంగా చదవాలని ఎస్సై శ్రీధర్ సూచించారు. మండలంలోని తేలుకుంటలో కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, దురలవాట్లు, షీటీం, డయల్ 100, హ్యాక్ ఐ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏఎస్సై శ్రీనివాసరావు, పీసీలు మనోహర్, సతీశ్, ప్రిన్సిపాల్ ఉన్నారు.

బీజేపీ నేతకు నివాళి

పెద్దపల్లిరూరల్: బీజేపీ పెద్దపల్లి సీనియర్ నాయకుడు పిన్నింటి రాజు అకాల మృతిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు సంతాపం వ్యక్తం చేశారు. రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు రాజ్‌గోపాల్, శ్రీనివాస్, రాజంమహంత, రాజేశ్వర్‌రావు, సంతోష్, సంపత్‌రావు, రాజేందర్, రమణారావు, రవి ఉన్నారు.

బొగ్గుగనుల వేలం ఉపసంహరించుకోవాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గుగనుల వేలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం యైటింక్లయిన్‌కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సింగరేణిపై అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. చంద్రయ్య, తిరుపతి, సురేంద్ర, రవితేజ, లింగారెడ్డి, రాజమౌళి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

రామగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం ప్రక్రియలో చేర్చడాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సెంటనరీకాలనీ తెలంగాణ చౌరస్తాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అధికారుల తోడ్పాటు మరువలేనిది



సన్మానం పొందిన ప్రజాప్రతినిధులు

రామగిరి: పార్టీలకు అతీతంగా సేవ చేస్తేనే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించడంలో అధికారుల సేవలు మరువలేనివని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శైలజారాణి ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో ఎంపీపీ, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీలను ఎంపీడీవో, ఎంపీవో సమ్మిరెడ్డి సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

‘కస్తూర్బా’ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

ఓదెల: మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కస్తూర్బా బాలికల పాఠశాలలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ అన్నారు. ఓదెలలోని కస్తూర్బా బాలికల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థుల భోజన వసతి, బోధన గురించి ఎస్‌వో జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు మద్దెనవేని రవి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ధర్మారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పత్తిపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రావు అన్నారు. పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో వీడ్కోలు, ఆత్మీయ స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన, వచ్చిన ఉపాధ్యాయులను విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూతి మల్లయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఏలేటి పద్మ ఉన్నారు.

ఇద్దరు అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా ఇద్దరు అధికారులను రెస్క్యూ విభాగానికి బుధవారం బదిలీ చేశారు. కార్పొరేట్ విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న జి.రాజేందర్‌రెడ్డిని భూపాలపల్లి రెస్క్యూస్టేషన్ ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే ఓసీపీ–1లో పనిచేస్తున్న ఎ.నర్సింహమూర్తిని మెయిన్ రెస్క్యూ స్టేషన్‌కు బదిలీ చేశారు.


ఖమ్మం టూర్‌కు మంథని మున్సిపల్ బృందం

మంథని: ఖమ్మం కార్పొరేషన్ ఎడ్యుకేషన్ టూర్‌కు మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ బృందం బుధవారం తరలివెళ్లారు. అక్కడ ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌తో పాటు లక్కారం ట్యాంకు బండ్, గొల్లపాడు చానల్, వాటర్ డ్రైన్స్, డంపింగ్ యార్డు, వైకుంఠదామం, స్ట్రీట్ వెండర్ మార్కెట్‌ను పరిశీలించారు. చైర్‌పర్సన్‌తో పాటు, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్, కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి, నక్క నాగేంద్ర ఉన్నారు.

మడేలయ్య ఉత్సవాలు

ఓదెల: ఓదెలలో మడేలయ్య ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మడేలయ్యకు నైవేద్యం సమర్పించారు.

స్వచ్ఛందంగా యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఓ స్నేహితుని పుట్టిన రోజున.. తోటి స్నేహితులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్థానిక ఎన్టీపీసీకి చెందిన నాగన్న అనే స్టూడెంట్ బుధవారం పుట్టిన రోజు సందర్భంగా అతడి స్నేహితులు సమాజహితం కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి నిర్ణయించుకున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో సాదిక్, సాయితేజ, మహేశ్, అనిల్ యాదవ్, సాయికుమార్, పవన్, శ్రీమన్, పాణి నిఖిల్, సాగర్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచిన రక్తదాతలను ఆస్పత్రి అధికారులు అభినందించారు.